అరకొరగా మొక్కల ఎగుమతులు

- ప్రారంభమైన సీజన్
- ఊపందుకోని వైనం

కడియం: వర్షాకాలం ప్రారంభం కావడంతో కడియం ప్రాంతంలోని నర్సరీల నుంచి దేశం నలుమూలలకు మొక్కల ఎగుమతులు మొదలవుతాయి. ఏటా జూన్ 15 నుంచి ఈ ఎగుమతుల ప్రక్రియకు రైతులు సిద్ధమవుతారు. రోజుకు 100 నుంచి 150కి పైగా వివిధ వాహనాలపై మొక్కల ఎగుమతులు జరుగుతుంటాయి. అయితే ఈ ఏడాది తీవ్రమైన వాతావరణ పరిస్థితుల ప్రభావం కారణంగా ఎగుమతులు మొదలైనప్పటికీ మందకొడిగానే సాగుతున్నాయని నర్సరీ రైతులు చెబుతున్నారు. గతంలో రోజుకు వంద వాహనాలపై ఎగుమతయ్యే మొక్కలు ఇప్పుడు యాభైకి అటూ ఇటూగా మాత్రమే లోడింగ్‌లు ఉంటున్నాయని వివరిస్తున్నారు.

వర్షాలే కారణం..

తీవ్ర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వర్షాలు సకాలంలో రాకపోవడంతో దాని ప్రభావం ఎగుమతులపై చూపిందని రైతులు అంటున్నారు. సాధారణంగా జూన్‌లో వర్షాలు మొదలు కావాలి. కానీ జూన్ నెలాఖరు నాటికి కూడా వర్షాలు తగినంతగా పడలేదు. అయితే మొక్కలు కొనుగోలు చేసి తీసుకువెళ్లే రాష్ట్రాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. అక్కడ వ్యవసాయ భూములు, లాండ్‌స్కేప్ ప్రాంతాలను సిద్ధం చేసుకోవడానికి ఆటంకాలు ఏర్పడ్డాయి. దీని ప్రభావం కూడా కడియం ప్రాంతం నుంచి మొక్కల ఎగుమతులు తగ్గడానికి కారణంగా వివరిస్తున్నారు.

మొక్కలకు టెండర్లు

ఏటా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు టెండర్లు వేస్తాయి. వాటికి అనుగుణంగా మొక్కల ఎగుమతులు జరుగుతుంటాయి. కానీ ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఏరాష్ట్రంలో కూడా పూర్తిస్థాయిలో టెండర్లు వేయలేదు. అరకొరగానే టెండర్లు వేసినప్పటికీ వాటికి సంబంధించిన లోడింగ్‌ల ప్రక్రియ కూడా సీజన్ ప్రారంభంలోనే పూర్తయిపోయింది. ప్రస్తుతం అరకొరగా జరుగుతున్న ఎగుమతులు కూడా పండ్ల తోటలు వేసుకునే రైతులు, ల్యాండ్‌స్కేప్ డిజైనర్లకు సంబంధించిన మొక్కల లోడింగ్‌లు మాత్రమే జరుగుతున్నాయి.



కడియపులంకలో మొక్కలను ఎగుమతి చేస్తున్న కూలీలు

కూలీలపైనా ప్రభావం

మొక్కల ఎగుమతుల సీజన్ ప్రారంభం కావడంతోనే కడియం మండలం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున కూలీలు ఇక్కడికి వచ్చేవారు. అయితే ఈ ఏడాది తగినంత ఎగుమతులు లేకపోవడంతో పనికి వచ్చిన వారు కూడా వెనుదిరిగి వెళుతున్నారు. గతంలో వంద లారీలు లోడ్ అయ్యేవి. ప్రస్తుతం యాభై లారీలు మాత్రమే లోడింగ్ అవుతున్నాయి. ఈ లెక్కన నిలిచిపోయిన యాభై లారీలకు సంబంధించి సుమారు 500 మందికి పనిలేకుండా పోతోంది.

ఆశాభావం

వాతావరణం అనుకూలిస్తున్న నేపథ్యంలో జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మొక్కల ఎగుమతులు బాగుంటాయన్న ఆశాభావాన్ని స్థానిక రైతులు వ్యక్తం చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఆయా ప్రాంతాల నుంచి మొక్కల కొనుగోలుదారుల ఆర్డర్లు ఇస్తారని చెబుతున్నారు.

సగానికిపైగా తగ్గాయి

సీజన్ ప్రారంభమయ్యాక రోజుకు 50 వరకూ వివిధ రకాల వాహనాలను ప్రతిరోజూ మొక్కల ఎగుమతులకు ఏర్పాటు చేసేవాళ్లం. ఈ ఏడాది ఆ స్థాయి డిమాండ్ లేదు. రోజుకు 25 నుంచి 30 వరకూ మాత్రమే వాహనాలను అడుగుతున్నారు. ఇతర ప్రాంతాల్లో వర్షాలు తగ్గితే ఎగుమతులు మళ్లీ ఊపందుకుంటాయి.

– ఎస్.బాబు, లారీ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం, కడియం

అంతంత మాత్రంగానే..

జూన్ 15 నుంచి మొదలయ్యే మొక్కల ఎగుమతులతో మండలంలోని అన్ని గ్రామాల మధ్య రోడ్లు వాహనాలతో కిక్కిరిసిపోయేది. ఇప్పుడు ఆ స్థాయిలో వాహనాలు కన్పించడం లేదు. తీవ్రమైన ఎండలు, అధిక వర్షాల కారణంగా తగినంత సీజన్ ఇంకా ప్రారంభం కాలేదనే చెప్పాలి. రానున్న రోజుల్లో ఎగుమతులు ఊపందుకోవచ్చు.

– ఏ. శ్రీనివాస్, మొక్కల ఎగుమతిదారుడు

20 మంది వచ్చేవాళ్లం

మొక్కల లోడింగ్‌లు మొదలయ్యాక ఏటా 20 మంది జట్టు సభ్యులు కడియపులంక వచ్చేవాళ్లం. ఈ ఏడాది ఒకరోజు లోడింగ్ ఉంటే మరో రోజు ఉండడం లేదు. దీంతో ఇప్పుడు 8 మంది మాత్రమే వస్తున్నారు. మిగిలిన వాళ్లు ఇతర వ్యవసాయ పనులకు వెళుతున్నారు.

– ఎం.వెంకన్న, ఎగుమతి కూలీ

క్లుప్తంగా

నేడు గో గ్రీన్ చాలెంజ్

రాజమహేంద్రవరం సిటీ: యువత – హరిత కార్యక్రమంలో భాగంగా నగరంలోని శనివారం గో గ్రీన్ చాలెంజ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 10 గంటలకు ఏవీ అప్పారావు రోడ్డులోని ముగ్ధ షాపింగ్ మాల్ నుంచి డివైడర్‌లో మొక్కలు నాటనున్నట్టు ఎంపీ భరత్‌రామ్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి, నెట్ బాల్ మాజీ క్రీడాకారిణి ప్రాచీ టిహలాన్ హాజరవుతారన్నారు. నగరంలోని యువత, విద్యార్థులు, సామాజిక సేవా సంస్థల నిర్వాహకులు, ప్రముఖులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

తోట సుబ్బారావుకు అభినందనలు



తోట సుబ్బారావును అభినందిస్తున్న స్వామి సూర్యభాస్కరేంద్ర సరస్వతి

రాజమహేంద్రవరం సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూధర్మ ప్రచార పరిషత్ జిల్లా ధార్మిక కమిటీలో తనను తీసుకోవడం చాలా సంతృప్తినిచ్చిందని గౌతమీ ఘాట్ ఆధ్యాత్మిక సంస్థల చైర్మన్, జ్ఞాన సరస్వతీ పీఠం చైర్మన్ తోట సుబ్బారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను పలువురు అభినందించారు. తోట సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో హిందూధర్మ ప్రచార పరిషత్ కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. సరస్వతీ ఘాట్‌లో తోట సుబ్బారావును శ్రీమద్ స్వామి సూర్యభాస్కరేంద్ర సరస్వతి పుష్పగుచ్ఛంతో అభినందించారు. కార్యక్రమంలో కేఎస్ మూర్తి నాయుడు పాల్గొన్నారు.

నివేదికపై చర్యలు తీసుకోండి

ప్రకాశం నగర్: ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్ రెండు రోజుల పాటు జిల్లాలో పర్యటించి, అందజేసిన నివేదికపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ ఆదేశించారు. ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కృష్ణ కిరణ్, జాయింట్ కలెక్టర్ శుక్రవారం తన చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఆహార భద్రత అమలు జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో రెండు రోజులు పరిశీలించి, నివేదిక ఇచ్చారన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు, మొబైల్ డెలివరీ యూనిట్ వాహనాల ద్వారా జరుగుతున్న నిత్యావసరాల పంపిణీ, రెండు అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ తీరుపై లోపాలను గుర్తించి నివేదిక రూపొందించారన్నారు. కృష్ణ కిరణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రత విషయంలో అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకుంటూ పౌష్టిక విలువలు కలిగిన బియ్యం, ఇతర నిత్యావసరాలను అందిస్తోందన్నారు. సమావేశంలో డీఎస్‌వో పి.భాస్కరరావు, డీఎం మార్కెటింగ్ ఎ.కుమార్, ఐసీడీఎస్ పీడీ కె.విజయ కుమారి పాల్గొన్నారు.

వర్గీకరణ కోసం ధర్నా

ప్రకాశం నగర్: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు పిలుపు మేరకు జిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ ధర్నా జరిగింది. జిల్లా అధ్యక్షుడు బల్లంకుల రాజు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తక్షణం దీనికి అనుకూలంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెట్టే సుజనరావు, ఉపాధ్యక్షుడు బొబ్బిలి వెంకట్రావు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు స్టేపై హర్షం

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై పెట్టిన పరువు నష్టం కేసులో సుప్రీంకోర్టు స్టే విధించడంపై ఆ పార్టీ నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలో న్యాయ వ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్న విషయం దీనిద్వారా రుజువైందన్నారు.

చారిత్రక విధ్వంసం తగదు

రాజమహేంద్రవరం సిటీ: కార్పొరేషన్ అధికారులు, అధికార పార్టీ నాయకులు సుందరీకరణ పేరుతో చారిత్రక సుబ్రహ్మణ్య మైదానంలో విధ్వంసానికి పాల్పడడం తగదని అఖిలపక్ష పార్టీల ప్రతినిధులు విమర్శించారు. బ్రహ్మోత్సవాల సుబ్రహ్మణ్య మైదానంలో సిటీ స్క్వేర్ నిర్మాణాలను వారు శుక్రవారం పరిశీలించి నిరసన తెలిపారు. మాజీ ఎంపీ జీవీ హర్ష కుమార్, మాజీ ఎమ్మెల్సీ అదిరెడ్డి అప్పారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.మధు, టీడీపీ నగర అధ్యక్షులు రెడ్డి మణి, యర్ర వేణుగోపాల్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, న్యూడెమోక్రసీ నాయకుడు కె.జోజి పాల్గొన్నారు.

చంద్రబాబుపై దాడి దారుణం

రాజమహేంద్రవరం రూరల్: పుంగనూరు నియోజకవర్గంలో చంద్రబాబుపై జరిగిన దాడి అప్రజాస్వామికమని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. తన నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ఈనెల 7వ తేదీ చంద్రబాబు నాయుడు రాజమహేంద్రవరానికి వస్తారని, ఇక్కడ నుంచి వివిధ ప్రాజెక్టులను సందర్శించడానికి వెళతారన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం



దివ్యాంగుడికి మూడు చక్రాల బ్యాటరీ సైకిల్‌ను అందజేస్తున్న చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ధవళేశ్వరం గ్రామానికి చెందిన దివ్యాంగుడు వేముల ఫణీంద్రకు శుక్రవారం ఆయన మూడు చక్రాల బ్యాటరీ సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, కార్మిక నాయకుడు సునీల్ పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయం వద్ద నిరసన

కంబాలచెరువు: రాష్ట్రవ్యాప్తంగా బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల జీతాల చెల్లింపులో విద్యాశాఖ నిర్లక్ష్య ధోరణికి నిరసనగా డీఈవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. యూటీఎఫ్ కార్యదర్శి ఎస్.అరుణకుమారి, జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం



సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూష కుమారి

ధవళేశ్వరం: మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు సర్వనాశనం అవుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి అన్నారు. ధవళేశ్వరం వివేకానంద ఐటీఐలో శుక్రవారం న్యాయ, పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాగింగ్ నివారణ, మాదకద్రవ్యాల బాధితులకు న్యాయ సేవలు, మాదక ద్రవ్యాల నిషేధం 2015 పథకంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యూష కుమారి మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలను వివరించారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎటువంటి కార్యకలాపాల్లో పాల్గొన్నా చట్టపరంగా శిక్షార్హులవుతారన్నారు. చుట్టుపక్కల అనుమానాస్పద చర్యలు జరిగితే వాటికి దూరంగా ఉండటంతో పాటు సంబంధిత అధికారులకు పిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ న్యాయమూర్తులు జి.హర్షవర్ధన్, కె.భాను, ఎం.జగదీశ్వరి, సాయి సుభాష్, ఎ. హిమబిందు, వి.స్వర్ణలత, వి.సాహితి, జి.బుల్లెమ్మ, పి.సాయిసుధ, సౌత్‌జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు, ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి, ఐటీఐ ప్రిన్సిపాల్ కె.సుబ్బరాజు పాల్గొన్నారు.

చర్చి సొమ్ము దుర్వినియోగం

ప్రకాశం నగర్: రక్షణాలయంలో ట్రెజరర్‌గా పని చేసిన న్యాయవాది రాచపల్లి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని రక్షణాలయం లూథరన్ చర్చి సంఘ సభ్యురాలు గొల్ల కవిత మారిట డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం సువిశేషపురం రక్షణాలయం లూథరన్ చర్చి వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రక్షణాలయం లూథరన్ చర్చికి సంబంధించిన కటారి నగర్ ఆంధ్రా బ్యాంకు అకౌంట్ 025110011009613కు రాచపల్లి ప్రసాద్ ట్రెజరర్‌గా, పాస్టర్ పృథ్వీరాజు ఇద్దరూ కో సిగ్నేటరీలుగా వ్యవహరించారన్నారు. కాగా.. తన తండ్రి గొల్ల జాన్సన్ మృతి చెందితే, ఆయన జ్ఞాపకార్థ కూడికను కుటుంబ సొంత ఖర్చులతో నిర్వహించామన్నారు. అయితే రక్షణాలయం చర్చి, పీసీసీ వారు, ట్రెజరర్ రాచపల్లి ప్రసాద్, సెప్టెంబర్ 28వ తేదీన జ్ఞాపకార్థ కూడిక చేసి ఖర్చులు భరించినట్టు మినిట్స్ బుక్కులో రాశారన్నారు. చర్చి సొమ్మును దుర్వినియోగం చేశారని ఆరోపించారు.

టీడీపీ పోస్టర్ల పంపిణీ

కడియం: టీడీపీ మేనిఫెస్టో ముద్రించిన పోస్టర్లను కడియపుసావరంలో శుక్రవారం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకులు అంగర రామ్మోహనరావు, మార్గాని సత్యనారాయణ, వెలుగుబంటి రఘురామ్, మజ్జి పద్మావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోడ్లు సక్రమంగా లేవని ప్రభుత్వంపై గోరంట్ల విమర్శలు చేశారు.

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

- సిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్
- నగరంలో గడప గడపకూ..



గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి జరుగుతోందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. 48వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి అజ్జరపు వాసు ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ ప్రదాత జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పాలనకు ఆకర్షితుడనై వైద్యవృత్తిలో ఉన్న తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ నాయకులు సంకిస భవానీ ప్రియ, కానుబోయిన సాగర్, పోలు విజయలక్ష్మి, కొత్త విజయ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేడుకగా సామూహిక సీమంతం



గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ 39వ డివిజన్ ఇన్‌చార్జి లంక ప్రసాద్ అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక 39వ డివిజన్ లింగంపేట పంతం సత్యనారాయణ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ అంగన్‌వాడీ సెంటర్లో కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ నరసమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్న పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. గవర్నమెంట్ హాస్పిటల్ డాక్టర్ ప్రసన్న మాట్లాడుతూ గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువుల సంరక్షణను వివరించారు. కార్యక్రమంలో గౌతమీ జీవకారుణ్య సంఘం డైరెక్టర్ నాగులపల్లి లక్ష్మణరావు, మైనార్టీ నాయకులు షేక్ మస్తాన్, సూపర్ వైజర్ పద్మ పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనలపై న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కంబాలచెరువు: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అమానవీయ ఘటనలకు వ్యతిరేకంగా శుక్రవారం న్యాయవాదులు ప్రదర్శన నిర్వహించారు. రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణ నుంచి గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకూ నిరసన తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ మణిపూర్‌లో ఒక వర్గం ప్రజలపై అణచివేత ఎలా జరుగుతోందో ప్రపంచం గమనిస్తోందన్నారు. వేడంగి చిట్టిబాబు మాట్లాడుతూ 640 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే ఏడుగురిని మాత్రమే అరెస్టు చేయడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి పీవీవీఎస్‌బీ రాజు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలన్నారు. అక్కడి అటవీ ప్రాంతంలోని విలువైన ఖనిజ సంపదను అంబానీ, అదానీలకు దోచిపెట్టేందుకు గిరిజన తెగలను భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఇసుకపట్ల రాంబాబు, పరమట గణేశ్వరరావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గేదెల వెంకటేశ్వరరావు, కె.ప్రవీణ్ కుమార్, దాసరి అమ్ములు, డీవీవీ.త్రినాథ్, ఎంఎస్ సాదిక్ హుస్సేన్, చిట్టూరి శ్రీనివాస్, సీఎస్ రాజు, కాశీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాలే విజయలక్ష్మి వ్యాఖ్యలు హాస్యాస్పదం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి

రాజమహేంద్రవరం సిటీ: టీడీపీ మహిళా నేత మాలే విజయలక్ష్మి వ్యాఖ్యలు హాస్యాస్పదమని వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్తి లక్ష్మి మాట్లాడుతూ మాలే విజయలక్ష్మి లేనిపోని అవాస్తవాలు మాట్లాడుతున్నారన్నారు. ఎంపీ భరత్‌రామ్ నేతృత్వంలో కొనసాగుతున్న తాను ఏదో ఉద్యోగం కోసం ప్రతిపక్షంలో ఉన్న మాజీ ఎమ్మెల్సీ వద్దకు వెళ్లాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పలు పార్టీలు మారిన మాలే విజయలక్ష్మి అవినీతి చిట్టా తన దగ్గర ఉందన్నారు. టీడీపీ నాయకులు వేసే బిస్కట్ల కోసం లేనిపోని ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.

ఘనంగా కిషోర్ కుమార్ జయంతి



కిషోర్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: కిషోర్ కుమార్ పలు విజయవంతమైన చిత్రాలకు పాటలు పాడారని, గాయకుడిగా, సంగీత దర్శకుడిగా, నటుడిగా, దర్శకుడిగా భారతీయ చలనచిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేశారని నట గాయకుడు, ఆర్కెస్ట్రా పితామహుడు శ్రీపాద జిత్ మోహన్ మిత్ర కొనియాడారు. జిత్ మోహన్ మిత్ర కళావేదికలో శుక్రవారం కిషోర్ కుమార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్ర మాట్లాడుతూ 50 ఏళ్లుగా కిషోర్ కుమార్ పాటలు పాడి తాను గాయకుడిగా మరింత గుర్తింపు పొందానన్నారు. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదన్నారు. శ్రీపాద మిత్ర, డాక్టర్ వంక బాలకృష్ణ, టీవీ శేషగిరిరావు, గుంటూరి శ్రీనివాస్, సాలూరి రాజేశ్వరరావు, డాక్టర్ గిరజాల సోమరాజు నాయుడు, హరిబాబు, డీవీవీఎస్ నారాయణ పాటలు ఆలపించారు. కార్యక్రమంలో వి.జగపతి, దేశినీడి బలరాం నాయుడు, పీవీఎస్ కృష్ణారావు, ఏఎస్ ఆనంద్, ముద్రగడ ఏసుబాబు పాల్గొన్నారు.

నన్నయ వీసీని కలిసిన ఎన్‌సీసీ అధికారులు



వీసీ ఆచార్య పద్మరాజుతో మాట్లాడుతున్న ఎన్‌సీసీ అధికారులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎన్‌సీసీ స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్ నిర్వహించేందుకు వీసీ ఆచార్య కె.పద్మరాజును త్రీ ఆంధ్ర గరల్స్ బెటాలియన్, ఎన్‌సీసీ కాకినాడ అధికారులు లెఫ్టినెంట్ కర్నల్ దుష్యంత్ కులశ్రేష్ఠ, సుబిదర్ మేజర్ మహ్మద్ అఫ్రాష్ ఖాన్, నాయబ్ సుబిదర్ శుక్రవారం కలిశారు. పది రోజుల పాటు జరిగే ఈ క్యాంపునకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎన్‌సీసీ ప్రతినిధులు హాజరవుతారన్నారు. వారి విజ్ఞాపనకు సానుకూలంగా స్పందించిన వీసీ ఆచార్య పద్మరాజు నన్నయ వర్సిటీలో కూడా ఎన్‌సీసీ యూనిట్‌ని ఏర్పాటు చేయాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ కూడా ఉన్నారు.

డివైడర్ పైకి నాన్‌స్టాప్ బస్సు



ఘటనా స్థలంలో నాన్‌స్టాప్ బస్సు

రాజానగరం: రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వెళుతున్న నాన్ స్టాప్ ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై దత్త ఆశ్రమం వద్ద శుక్రవారం సాయంత్రం అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకుపోయింది. ముందు టైరు పంక్చరవ్వడంతో ఈ ప్రమాదంలో జరిగింది. ఆ సమయంలో బస్సులో 35 మంది ప్రయాణికులు ఉన్నారు. డివైడర్ పైకి ఎక్కి ఆగిపోవడంతో ఎవరికీ ఏవిధమైన ప్రమాదం జరగలేదు. ప్రయాణికులను వేరొక బస్సులో గమ్యస్థానానికి పంపించారు. దీనిపై స్థానిక పోలీసులను వివరణ కోరగా.. టైరు పంక్చరవ్వడంతో ఈ ప్రమాదం జరిగిందన్నారు. బస్సులోని ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నారని తెలిపారు.

కోరుకొండ సొసైటీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న కోరుకొండ పీఏసీఎస్ చైర్ పర్సన్ తేజో వీరన్న నాయుడు, సీఈఓ సుధాకరవర్మ

మధురపూడి: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కోరుకొండ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఉత్తమ సొసైటీ అవార్డును సాధించింది. అమరావతిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి చేతుల మీదుగా కోరుకొండ సొసైటీ చైర్ పర్సన్ మారిశెట్టి తేజో వీరన్న నాయుడు, సీఈఓ గొట్టుముక్కల సుధాకర వర్మ అవార్డును అందుకున్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన సొసైటీల్లో ఇది ప్రథమస్థానం సాధించింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని 298 సంఘాల్లో కోరుకొండకు ప్రథమస్థానం దక్కింది. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, ఈసీఓ నరసింహారావు పాల్గొన్నారు.

455 మందికి వైద్యసేవలు

సీతానగరం: మండలంలోని రాపాక గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 455 మందికి సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. ఇంటి వద్ద ఉన్న రోగులకు వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి బాలింతలు, గర్భిణులు, పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు.

బాధిత కుటుంబాలకు సాయం

సీతానగరం: వెదుళ్లపల్లిలోని మూడు బాధిత కుటుంబాలకు ఆదివారం జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్షయ సంజీవని కార్యక్రమంలో బియ్యం, రూ.రెండు వేలు విలువైన నిత్యావసరాల కిట్లను అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు తన్నీరు త్రిమూర్తులు, తన్నీరు రామకృష్ణ, తన్నీరు వెంకటేశ్వరరావు, నల్లమోలు లక్ష్మణ్, చిక్కిరెడ్డి జోగారావు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.